# సన్మానం

- కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం

సాయంత్రం ఆరుగంటలకల్లా బాలాజీ ఫంక్షన్ ప్యాలెస్ ప్రాంగణమంతా ఇసుకేస్తే రాలనంతగా జనంతో క్రిక్కిరిసిపోయింది. అశేష పాఠకజనావళితో ఎంతో హడావిడిగా ఉందక్కడ. దానికి కారణం?

సాహితీ కళామతల్లి కళకళలాడుతూ ఆనందపారవశ్యంతో నర్తించే శుభఘడియలవి. సాహితీ కళకారులంతా ఒకే వేదికపై దర్శనమిచ్చే పర్వదినం. సాహితీవేత్తల సన్మాన కార్యక్రమం ప్రారంభమైంది. అధ్యక్షులూ, ముఖ్యాతిథీ, వ్యాఖ్యాతల వంటి పెద్దలంతా తమతమ ఉచితాసనాలను అలంకరించారు. పాఠకుల్లో ఆలోచనా శక్తినీ, చైతన్యాన్నీ కల్గించేలా అద్భుత కథా సృష్టి చేస్తూన్న రామనాథం కూడా వేదికపై కూర్చుని ఉన్నారు. విచ్చేసిన ఆహూతలందరికీ నిజంగా అది కన్నుల పండుగే.

అయితే ఇంకా ఎంతోమంది కథా రచయితలు దర్శనమిస్తారనుకుంటే వాళ్ళెవ్వరూ వేదికపై కనబడకపోవడంతో ఏదో నిరుత్సాహం అలుముకుంది సాహితీ అభిమానుల్లో. తమ నిరుత్సాహానికి కారణం ఏంటో తెలియజేస్తూ వందలాది స్లిప్స్ ఆ పక్కనుండీ, ఈ పక్కనుండీ వ్యాఖ్యాత చేతికి అందనే అందాయి.

చిరునవ్వులు చిందిస్తూ వ్యాఖ్యాత-

"విచ్చేసిన సాహితీ బంధువులకూ, సాహిత్యాభిమానులకూ, పురప్రముఖులకూ, అశేష ప్రజానీకానికి అందరికీ సాహితీ కళాంజలులు అర్పిస్తున్నాను" ప్రాంగణమంతా కొద్ది నిముషాల పాటు కరతాళధ్వనులతో మారుమ్రోగింది. అంతలోనే చీమ చిటుక్కుమంటే వినబడేంత నిశ్శబ్దం ఆవరించింది అక్కడ.

"రామనాథం గారిని గురించి నేను పరిచయం చేయడానికి ముందే మీరంతా ఆయన్ని బాగా చదివి జీర్ణించుకున్నారనే చెప్పొచ్చు" మళ్ళా ఎడతెరిపిలేకుండా చప్పట్లు మ్రోగడం, నిశ్శబ్దం ఆవరించడం అంతా రెండుమూడు నిముషాల్లో జరిగిపోయింది.

"ఇప్పుడు రామనాథం గారు ఆయన రాసిన వివిధ కథాంశాలను స్పృశిస్తూ ఉపన్యాసం ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను" అంటూ వ్యాఖ్యాత కూర్చోవడం రామనాథం లేచి నిలబడి మైకు ముందుకు రావడం జరిగింది. మళ్ళా చప్పట్ల మోత.

రామనాథం లేచి మాట్లాడుతూ...

"చెప్పదల్చుకున్న విషయాలు నీతినిజాయితీలకు సంబంధించినవే అయినా అవి సూటిగా చెబితే పాఠకలోకం పెడచెవిన పెట్టే ప్రమాదం ఉంది. పాఠకుల్లో చైతన్యాన్ని కల్గించి ఆలోచింపచేయాలన్నదే నా లక్ష్యం. నేటి సమాజాన్ని పరిశీలిస్తే అసమానతలూ, హెచ్చుతగ్గులూ, హీనాధికాల్లాంటి భేదాలూ... విభేదాలూ మునుపున్నంతగా ఇప్పుడు లేవనే చెప్పవచ్చు. అయితే ఇంకా రావలసిన మార్పు చాలా ఉంది. ఈ మార్పు ఏ ఒక్కడివల్లా రాదు. రచయితలంతా వివిధ కోణాలతో మార్పుపై దృష్టి సారించినప్పుడే చెడులేని మంచి మన సమాజంలో ప్రస్ఫుటమవుతుంది" అంటూ టకటకా చెప్పేశాడు.

"మహేశ్వరి, అన్నపూర్ణ, ఫాతిమా, రుక్సానా వంటి మహా రచయిత్రులు, పాణి, తేజ్, వివేక్, అక్షర్‌వంటి మహా రచయితలు అంతా మీ పంథాలోనే నడుస్తున్నారు కదా! మీ మార్గం మహామహులకే ఆదర్శం కావడం ఆనందదాయకం. ఆంధ్రుల అదృష్టమనే చెప్పాలి" ముందు కూచున్న ఒక సాహిత్యాభిమాని బిగ్గరగానే ప్రశంసించాడు.

"వాళ్లంతా కూడా వస్తే ఒకే వేదిక మీద వాళ్లందర్నీ కూడా చూసే భాగ్యం మాకు దక్కేది. వాళ్ళెవరూ రాకపోవడం మా అందరికీ వెలితిగానే అన్పిస్తోంది" మరో సాహిత్యాభిమాని అనేశాడు తన మనోభిప్రాయాన్ని.

నవ్వి ఊరుకున్నాడు రామనాథం.

"వివిధ ప్రచ్ఛన్ననామాలతో రచనలు కొనసాగించే రామనాథం గారి వివిధ అవతారరూపాలే వాళ్లంతా. ఇప్పుడైతే మీకు వెలితనిపించడం లేదుగా" అంటూ వ్యాఖ్యాత వాస్తవానికి చమత్కారాన్ని రంగరించడంతో అదేపనిగా కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. పూలమాలలెన్నో రామనాథం కంఠసీమను ఆశ్రయించాయి. పూలకిరీటం నెత్తినపడింది. తామరతంపరగా దుశ్శాలువలెన్నో పై మీద వచ్చి వాలాయి.

★ ★ ★

"సీతా గ్లాసుతో మంచినీళ్లు పట్రావోయ్" అడిగాడు పడక్కుర్చీలో ప్రశాంతంగా కూర్చున్న రామనాథం. చీరకొంగు నోటికడ్డంగా పెట్టుకుని గబగబా వచ్చింది సతీమణి. గ్లాసందుకుంటూనే ఆమె వంక అదోలా చూశాడు రామనాథం.

"ఏమిటా కన్నీళ్ళు?! ఏమైందిప్పుడు? ఎందుకలా బాధపడ్తున్నావ్. మన పెళ్ళయి పదిహేనేళ్లయింది. నిన్నెప్పుడూ పన్నెత్తిమాట అన్లేదు. అన్ని విషయాల్లో సహ ధర్మచారిణిగా నీకు నువ్వేసాటి. అలాంటినువ్వు కంటతడిపెడితే నేను తట్టుకోగలనా చెప్పు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు రామనాథం ప్రేమాభిమానాలు అమితంగా ఒలకబోస్తూ.

"అబ్బే... అదేంలేదండీ. నిన్న మీకు జరిగిన ఘనసన్మానం తలచుకుంటూంటే ఆనందభాష్పాలు వాటంతటవే అప్రయత్నంగా వచ్చేస్తున్నాయంతే. భలేవారండీ మీరు. నేను బాధపడ్డం ఏమిటి? ఇంకానయం" అని భార్యామణి అంటూంటే-

"చూడు సీతా! ఆనందభాష్పాలకీ అశ్రుకణాలకీ తేడా తెలీనంత వెర్రిబాగులోడ్ని కాదు. అసలేమైందో చెప్పు. మనమధ్య అరమరికలుగానీ దాపరికాలుగానీ ఉండకూడదు" రామనాథం మాటలు పూర్తికాకుండానే వెక్కివెక్కి ఏడ్చేస్తూ వంటింట్లోకి పరుగెత్తింది సీత.

"అసలేమయింది ఇవ్వాళ నీకు? ఎప్పుడూ గలగలా నవ్వుతూ ఎంతో సందడిగా తిరిగే నువ్వు కంట తడిపెడితే నేను భరించగలనా చెప్పు" ప్రాధేయ పూర్వకంగా అడిగేడు రామనాథం.

"ఏం చెప్పమంటారండీ.. పెళ్లయిన నాటినుంచీ నన్ను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు మీరు. నాముద్దూ, ముచ్చటా మీరేనాడూ కాదనలేదు. ఇంకా చెప్పాలంటే అనేక సందర్భాల్లో నేనే మీపట్ల ఎంతో దురుసుగా ప్రవర్తించాను నిజంగా మీరు శ్రీరామచంద్రుడండీ!"

"మ్రైతే ఆ కన్నీళ్లేంటి?!"

"మనలో ఏ లోపం లేకపోయినా మనకి సంతానసాఫల్యం కలగలేదంటే కారణం ఆ భగవంతుడు మనపట్ల చిన్నచూపు చూడడమేనండీ.."

"అదా విషయం? పిచ్చిదానా పిల్లల్లేకపోతేనేం? నాకు నువ్వూ, నీకు నేను లేమా. ఇద్దరం కలిసి చిలకాగోరింకల్లా జీవనం సాగిస్తున్నాం. ఈ జన్మకిది చాలదూ"

"అదికాదండీ!"

"మరి..?"

"అమ్మలక్కలంతా నేను కంటబడినప్పుడల్లా..."

"ఆఁ కంటబడినప్పుడు?"

"గొ..డ్రా...లు...అంటూ ఈసడించుకుంటూ సూటిపోటి మాటలతో నా మనసును చిల్లులజల్లెడ చేసేస్తున్నారండీ. ఈ విషయం పదేపదే మీకు చెప్పి మిమ్మల్ని బాధపెట్టడం ఇష్టం లేక నాలోనేనే కుమిలిపోతున్నానండీ..." అంటూ భోరున ఏడ్చేసింది సీత.

"నాకు పంచాల్సిన బాధ కూడా నువ్వే పడిపోతుంటే ఎలా చెప్పు? నాకు సగం పంచివ్వద్దూ... ప్లీజ్ నాక్కూడా పంచిపెట్టవూ"

అప్పటికైతే ఆమెను నవ్వించగలిగాడు గానీ 'ఇదే పరిస్థితి మరోసారి ఎదురైతే.?'

రామనాథం బుర్ర చురుగ్గా పనిచేయసాగింది. వెంటనే కలం, కాగితాలూ తీస్కుని.

"నేనో కొత్తకథకు జీవం పోయాలనుకుంటున్నానోయ్ భార్యామణీ! పర్మిషన్ గ్రాంటెడ్ అయినట్లేగా..!"

గలగలా నవ్వేసింది సీత.

* * *

పోస్ట్‌మెన్ ఆపసోపాలు పడిపోతూ వచ్చి ఉత్తరాలకట్ట సీతమ్మ చేతికందించి కాసిన్ని మంచినీళ్ళు గటగటా తాగేసి "వెళ్ళొస్తానమ్మగారూ" అంటూ సైకిలెక్కి తుర్రుమన్నాడు.

'ఇన్ని ఉత్తరాలు ఒక్కసారిగా వచ్చి పడ్డాయేంటబ్బా' అనుకుంటూ ఒక్కొక్కటి తీసి చదవసాగింది.

"మీ కథ చదివాక పిల్లల్ని కన్నందుకు చెంపలేసుకుంటున్నాం"

"మీ కథ వాస్తవాన్ని తూర్పారబట్టింది. పిల్లల్ని కన్న తల్లిదండ్రులెంతో మంది వార్ధక్యంలో నిస్సహాయులుగా మిగిలిపోతున్నారనీ. పిల్లలుండీ లేనివాళ్ళగా ఫీలయ్యే వాళ్ళెంతోమంది ఉన్నారని మీరన్నారు. పిల్లలుండి ఇలా అయ్యేకంటే గొడ్రాలే నయం అన్పించింది. మీకు మా శుభాభినందనలు"

"మీ కథ చదివాక మా అందరికీ అన్పించింది తాళికట్టిన కట్టించుకున్న మరుక్షణం నుండీ భర్తకు భార్యా, భార్యకు భర్త తప్ప ఇంకెవ్వరూ ఏమీ కాదని...యూ ఆర్ రియల్లీ గ్రేట్"

"మీ కథ చదివా! కన్నపిల్లలున్నా ఆదరణకు నోచుకోక దిక్కులేని బ్రతుకులీడ్చే వాళ్ళెంతోమంది ఉన్నారనీ, ఈ పిల్లల్ని ఎందుకు కన్నట్లు?! పుట్టకుండానే జాగ్రత్తపడాల్సింది. పోనీ పుట్టినా, పుట్టీ పుట్టగానే గొంతునులిమి చంపేసినా బావుండేది. పాపం వచ్చినా ఫర్వాలేదు.. అంటూ మీరు ప్రత్యక్షంగా, పరోక్షంగా పశ్చాత్తాపం చెందేవాళ్ళు ఎంతోమంది ఉన్నారని మీరన్నది అక్షరసత్యం. మీ కథ ఎంతో మందికి కనువిప్పు కలిగించేదిగా ఉంది"

"ఇటీవల అచ్చయిన మీ కథ మా కుటుంబసభ్యులంతా చదివారు. విదేశీ మోజులో పడి కన్నవాళ్ళని కాలదన్నే పుత్రరత్నాలు ఎంతోమంది ఉన్నారని, పిల్లల్ని కన్న పాపానికి ఈ జన్మకీ నరకం అనుభవించాల్సిందేనని వాపోతున్న తల్లిదండ్రులెంతో మంది ఉన్నారని గ్రహించాం. నూటికి తొంభైమంది తల్లిదండ్రులు పిల్లల నిరాదరణకు బలైపోతూ నరకయాతన అనుభవిస్తున్నారన్నది వాస్తవం. థ్యాంక్యూ వెరీమచ్"

ఒక్కొక్క ఉత్తరం తీసి చదువుతోంది సీతమ్మ. అప్రయత్నంగా కన్నీళ్ళు జలజలా రాలి మనసెంతో తేలికపడింది. ఇంతలోనే రామనాథం అక్కడికి రానే వచ్చాడు. పాఠకుల అభిప్రాయాలకు భార్య ఎంతగా స్పందించిందో గ్రహించాడు.

"ఇప్పుడు నిజంగా ఇవి అశ్రుకణాలు కావండీ! ఆనందభాష్పాలే! పిల్లల్లేకున్నా ఫర్వాలేదు. మరుజన్మంటూ ఉంటే మీకే అర్ధాంగిని కావాలనుకుంటున్నాను" అంటూ గలగలా నవ్వేసింది.

"ఈమధ్య నాకు జరిగిన సన్మానంకంటే ఇప్పుడు నువ్వు గలగల గోదారమ్మలా నవ్వేశావు చూడు అదే నిజమైన ఘన సన్మానం. నాక్కావాల్సింది నీ నవ్వే" అన్నాడు రామనాథం.

★

